

# 'అదే' కథలు

## – ఆర్.శర్మ దంతుర్తి

ముందు మాట – అమెరికా వచ్చిన భారతీయుల్ని 'దేశీ'లంటారని, వారి దైనందిన జీవితాల్లో జరిగే అనేకానేక విషయాలతో అమెరికా దేశీయ కథలు అనే పేరుతో ఈ వరస కథలు మొదలుపెట్టాను, గౌరవం కోసం 'య' అనేది చేర్చి. ఇందులో చర్చించిన సమస్యలు పూర్తిగా కాకపోయినా చాలా మటుక్కు అన్నీ స్వకపోల కల్పనలు – ఇలా జరిగి ఉండొచ్చని ఊహించి రాసినవి. కొన్ని ఇలా జరిగినట్టు ఇంటర్నెట్ మీదా, వార్తల్లోనూ చదివినవి. అవి మీకు కానీ మీకు తెల్సున్నవాళ్ళకి కానీ జరిగితే అది పూర్తిగా కాకతాళీయం/యాదృచ్ఛికం మాత్రమే. సరదాకి రాసిన ఈ కథలు వినోదంగా చదువుకోవడానికి మాత్రమే. చాలామటుకు నవ్వు వచ్చినా కొన్ని కథల్లో ఏడుపుకూడా రావొచ్చు. ఆ నవ్వులకి, బాధలకి, దుఃఖాలకి నా బాధ్యత లేదు.

## డ్రైవింగ్

**జీవితంలో** కొన్ని ఎప్పటికీ మారవు అనేది జగద్విదితం. ఉదాహరణకి చూడండి. నీలేష్ కులకర్ణికి నాసిక్ స్కూల్లోంచి బయటకి రాగానే ఢిల్లీ ఐ ఐ టి లో సీటు, అక్కడ నాలుగేళ్ళు చదువుకున్నాక వెంఠనే అమెరికా అందర్లాగానే. అదింకా పూర్తవకుండానే వర్జీనియా టెక్ లో ఎమ్ ఎస్ కి సీటు. ఏ ఐ ఐ టి లో చూసినా ఇదే కదా ప్రహసనం? దీంట్లో ఎవరో ఒకరిద్దరు తేడాగా ఉండి, ఐ ఏ ఎస్ రాసినా మొత్తానికి తొంభై శాతం దిగేది అమెరికాయే కనక ఇందులో పెద్దగా ఆశ్చర్యంగా చెప్పుకోవడానికేం లేదు. అయితే నీలేష్ కి వర్జీనియా టెక్ లో ఎమ్ ఎస్ అవుతూనే ఉద్యోగం వచ్చేక ఇంక మిగిలినది ఇండియా వెళ్ళి న్యూటన్ గారి మోడర్న్ మూడో సూత్రం ప్రూవ్ చేయడం. అంటే 'అమెరికా వచ్చిన ప్రతి ఇండియన్ తనకి నచ్చిన ఈక్వల్ అండ్ ఆపోజిట్ జెండర్ ని పెళ్ళిచేసుకుని అమెరికాకి తీసుకొస్తాడనే' కొత్త సూత్రం.

అలా ఇండియా వెళ్ళిన నీలేష్ కి చూసినవాటిలో బాగా నచ్చేసిన సంబంధం బాంబే లోని నమితా అరోరా. మధ్యవర్తి ద్వారా విన్న విషయాల ప్రకారం అరోరా కుటుంబం కాస్తో కూస్తో డబ్బున్నవారే. మరీ అంత మెర్సిడిస్ కారు కాదు కానీ, బాంబేలో విలే పార్లే అనే చోట చిన్న ఇల్లూ ఓ బుల్లి కారూ ఉన్నాయి. అమ్మాయి కూడా మెకానికల్ ఇంజినీరింగ్ చదువుకుంది విక్టోరియా జూబ్లీ కళాశాలలో. ప్రస్తుతానికి ఓ చిన్న ఉద్యోగం చేస్తోంది. నీలేష్ కి బాగా నచ్చిన అంశం నమిత ఏమీ భేషజాలు లేకుండా మాట్లాడింది తనతో. చదువుకునేటప్పుడు కాలేజీ రోజుల గురించి అడిగితే సరదాగా సమాధానాలు చెప్పింది కూడా. కట్టూ బొట్టూ చూస్తే సంప్రదాయంగా ఉంది. నీలేష్ తల్లి కూపీలాగిన

విషయాలు కూడా బాగున్నాయి. వియ్యపురాళ్ళు ఇద్దరూ ఒకరికొకరు నచ్చినట్టే లెక్క. మొగుళ్ళకి ఇవేం అంత పట్టవు కనక 'మీ ఇష్టం' అనేసారు. అలా పెళ్ళి కుదిరిపోయి దంపతులైపోయిన మూడునెలలకి కొత్తకాపురం మొదలైంది సాల్ట్ లేక్ సిటీలో.

ఎప్పుడో వర్జీనియా టెక్ లో జేరగానే నేర్చుకున్న డ్రైవింగ్ కి మెరుగులు దిద్దుకుంటూ నీలేష్ ఇప్పుడు ఉద్యోగం వచ్చాక – ఉద్యోగం రాగానే ఇండియన్స్ కానీ చైనీస్ కానీ హోండా, టాయోటా కారు తప్ప మరోటి కొనుక్కోరని నిరూపిస్తూ – తాను కొనుక్కున్న టయోటా కామ్రీ కారులో నమిత ని తీసుకుని దేశం మీద తిరుగుతున్నాడు వీలున్నప్పుడల్లా. అయితే ఇంట్లో డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నది తనకొక్కడికే కనక నమిత డ్రైవ్ చేయకూడదు. దీనివల్ల మరిన్ని కష్టాలున్నై. నమితకి ఉద్యోగం వచ్చేలోపు ఇంట్లో బోరు కొడుతోంది. అసలే ఎప్పుడూ గల గలమనే మంచి ఏక్టివ్ సిటీ బాంబేలోంచి వచ్చినావిడ. ఇక్కడ నాలుగ్గోడల మధ్యా పిచ్చెక్కినట్టుంది. బయటకెళ్ళాలంటే డ్రైవింగ్ తప్పనిసరి. మరో నెల గడిచేసరికి తన గోడు వెళ్ళబోసుకున్నాక నీలేష్ డ్రైవింగ్ లైసెన్స్ ఆఫీసుకి తీసుకెళ్ళేడు.

మొదట్లో లెర్నర్ పర్మిట్, ఆ తర్వాత టెస్ట్ పాసైతే లైసెన్స్ ఇస్తారు. ఫలానా రోజుకి రావచ్చు ప్రాక్టీస్ చేసాక. లెర్నర్ పర్మిట్ తీసుకున్నప్పటినుండి వీకెండ్ తీర్థయాత్రలన్నీ మానుకుని నీలేష్ నమితకి డ్రైవింగ్ నేర్పించడం మొదలుపెట్టాడు. మొదట్లో గంట, తర్వాత అది పెంచుకుంటూ మూడేసి గంటలు ప్రాక్టీస్.

ఇలా పక్కకి తిరగకూడదు; అదిగో ఎర్రలైట్ చూసుకోలేదు. అమ్మోయ్, చంపేసిందిరో, ఏక్సిడెంట్ వెంట్రుకవాసిలో తప్పింది అంటూ నమిత మీద నీలేష్ అరుపులు. ఆవిడ మొహం ముడుచుకోవడం, ఇంటికొచ్చాక ఒకరిమీద ఒకరికి ఏడుపు; మళ్ళీ వారాంతానికి మరో సారి తయార్. ఏక్సిడెంట్ కాకుండానే ఎందుకీయన అరుస్తాడని ఆవిడనుకుంటే చిన్న గీత పడినా, సొట్ట పడినా ఏక్సిడెంట్ అయితే ఇన్స్యూరెన్స్ ఎలా పెరుగుతుందో తనకి ఆఫీసుకెళ్ళడానికి ఎంత కష్టమో, ఎవడు కోర్టుకి కేసు వేసి లాగుతాడో, ఏది ఎటు తిరిగి ఎటొస్తుందో అని అయ్యగారి పైకి చెప్ప(లే)ని ఏడుపు. పోనీ ఇంత నా మీద అరవకుండా ఏ డ్రైవింగ్ క్లాసులోనో జేర్పించవచ్చు కదా అని నమిత అడిగితే దాని కయ్యే ఖర్చు నాలుగు వందలకి పైన. హమ్మో! నెలకి తమకయ్యే గ్రోసరీ ఖర్చే అంత లేదు. ఆ డబ్బులు ఇలా తగలేయడం దేనికీ?

అయితే అయ్యగారికి తెలీని విషయం మరోటి ఉంది. వీక్ డేస్ లో అమ్మగారు రోజూ డ్రైవింగ్ లైసెన్స్ రూల్స్ అవీ బాగా వంటబట్టించుకున్నారు. అయినా అమ్మగారికి డ్రైవింగ్ రాకపోతే కదా? బాంబేలో ఉన్నప్పుడు అక్కడ బుల్లి కారు చాలాసార్లు నడిపారు కూడా. నాలుగు నెలలు ప్రాక్టీస్ అయ్యేక డ్రైవింగ్ టెస్ట్ లో నమిత ఫెయిల్ అయింది. ఇప్పటి వరకూ తనకి బాగానే డ్రైవింగ్ వచ్చు అనుకున్న నమితకి ఇది పెద్ద షాక్. స్టాప్ సైన్ దగ్గిర పూర్తిగా ఆపలేదుట, రివర్స్ పార్కింగ్ అంత బాగా చేయలేదు అని ఫెయిల్ చేసారు. నమిత మీద ఈ సారి అయ్యగారు తన కోపం చూపించాడు – "నీకేదో పెద్ద డ్రైవింగ్ బాగా వచ్చు అని అన్నావుగా, ఇదేనా" అంటూ. కాసేపటికి నమిత ఏడుపు ఆపేక సరే అని సముదాయించడం తప్పదు కదా, నీలేష్ మొదటి సారి తనకీ అలాగే అయినట్టు చెప్పాక సర్దు మణిగింది ఆ రోజుకి

మరో మూడు వారాలు మళ్ళీ ప్రాక్టీస్. మళ్ళీ ఒకరి మీద ఒకరు అరుపులు; మళ్ళీ టెస్టింగ్. ఈ సారి టెస్ట్ కి వచ్చినాయన మంచివాడే. బయటకొచ్చి పాస్ అన్నాడు కాసిని తప్పులున్నా. అలా అమ్మగారికి స్వేచ్ఛ ఇవ్వబడింది. ఇప్పుడు అమ్మగారో డ్రైవర్. పొద్దునే అయ్యగార్ని ఆఫీసు దగ్గిర దింపాక ఆవిడదే కారు. మొదట్లో ఇంటికి దగ్గిర్లోనే రోడ్లమీద తిరిగాక మెల్లిగా ఆ పైకి, మరో చోటికి ఆ తర్వాత హైవేమీదకి తిరగడం అలవాటైంది. మొదట్లో ఉన్న జంకు పోయి ఇప్పుడు అమ్మగారు జాం అంటూ ఎక్కడికైనా వెళ్ళిపోగలదు. అలా ఎక్కడికి వెళ్ళిపోతోందో మాత్రం అయ్యగారికి తెలియకుండా జాగ్రత్త పడింది.

నాలుగునెలలు పోయాక ఓ వారాంతం రోజు పొద్దున్నే కాఫీ తాగడానికి వంటింట్లోకి వెళ్తే ఎనిమిది వందల డాలర్ల కేష్ కౌంటర్ మీద ఉండడం చూసి అక్కడే ఉన్న నమితని అడిగేడు ఆశ్చర్యంగా నీలేష్, "ఎవరిదీ డబ్బు?"

"నాదే, అదే మనదే"

"అవునా, ఇక్కడకెందుకొచ్చిందా అని?"

"నా సంపాదన చూపిద్దామని" చిలిపిగా నవ్వుతూ అంది నమిత.

"నువ్వు ఉద్యోగం చేస్తున్నట్టు నాకు తెలియదే, ఎప్పుడు మొదలు పెట్టావేమిటి?"

"నిన్ను ఆఫీసులో దింపాక పక్కసందులో ఉన్న కార్ మెకానిక్ షాపులో వాలంటీర్ గా చేస్తానని మెకానికల్ ఇంజినీర్ ని అనీ చెప్పాను. ముందు వద్దు అన్నా రెండు మూడు సార్లు అడిగితే సరే అన్నాడు. ఓ రెండు నెలలు చేసాక చుట్టుపక్కల ఉన్న గాస్ స్టేషన్లు, షాపులలో ఓ ఎడ్వర్టైజ్ మెంట్ ఇచ్చాను – ఆయిల్ ఛేంజ్ కి, బ్రేక్ పేడ్స్ మార్చడానికి పని చేస్తాను అని. పొద్దున్న పది నుండి మధ్యాహ్నం మూడు వరకూ అపాయింట్ మెంట్ ద్వారా మాత్రమే, మన ఇంటి గరాజ్ లోనే. అలా రెండు నెలలు వాలంటీర్ గా చేసాక ఇవన్నీ ముందే తెలుసు కనక ఇలా మొదలుపెట్టాను."

కళ్ళు విప్పార్చుకుని నోరు వెళ్ళబెట్టిన నీలేష్ అలా చూస్తూంటే ఇంకా చెప్పింది నమిత, "ఈ మాత్రం పని నేను చేయలేనా? ఇండియాలో మా కారుకి చిన్న చిన్న పనులు నేనే చేసాను అనేకసార్లు. ఇక్కడ మెకానిక్ అవడానికి లైసెన్స్ లేదు కానీ చీప్ గా ఆయిల్ చేంజ్ చేస్తానన్నా, బ్రేక్ పేడ్స్ మారుస్తానన్నా మనదగ్గిరకి రావడానికి బోల్టుమందున్నారు కదా? అలా ఇంట్లోనే ఉండి పనిచేస్తున్నా."

"మరి ఆ తీసేసిన మురికి ఆయిల్ ఏం చేస్తావు?"

"ఓ చిన్నపాటి డ్రమ్ కొన్నాను, అందులో తీసేసిన ఆయిల్ పడుతున్నాను. వీలున్నప్పుడు వెళ్ళి అది రీసైకిల్ సెంటర్లోనో మరో చోటో ఇవ్వొచ్చు ఎక్కడో కనుక్కుని. అదేమంత పెద్ద విషయం?"

"ఇవన్నీ నీకు ముందే తెలుసు అన్నావు. ఇండియాలో అయితే మాత్రం ఎలా తెలుసు?"

"అమ్మాయిగారు విక్టోరియా జూబ్లీ నుంచి మెకానికల్ ఇంజినీర్ అని మర్చిపోయావా నీలేష్?" వచ్చి తనని దగ్గిరకి లాక్కునే నీలేష్ తో అంది నమిత,

*నీతిః డ్రైవింగ్ ఒక్కటే ఏం ఖర్మ, ముదితల్ నేర్వగ రాని విద్య కలదే ముద్దార నేర్పించినన్*

Post your comments